పాటలూ, పద్యాలూ రాసిన ఒక జెక్ కవి పేరని తెలియదు. ఎన్నో ఏళ్ళ తర్వాత నేను జెకోస్లోవేకియాలోని ప్రాహా నగరానికి వెళ్ళినప్పుడు నేను ఆ మహానుభావుడి విగ్రహం వద్ద పూవులనుంచాను—" అన్నాడు.

—బాగా చిన్నతనంలో ఒకరోజు నెరూదా మనసెందుకో ఉద్విగ్నమయింది. ఆ ఉద్వేగాన్ని అతడు కాగితంమీద పెట్టినపుడు—ఆ వర్షించిన మాటలు, ఆ వరుసలు తను రోజూ మాట్లాడేవి కాదని అతనికి తెలిసింది. అది ముగించగానే అతడిని సంజ వెలుతురులాంటి అందమైన, భారమైన, తియ్యని విచారంలాటి భావమేదో ఆవహించింది. అతడిని ప్రేమతో దేవతలా చూచుకుంటూ వచ్చిన సవతితల్లి మీద రాసిన ఆ కవిత నెరూదా మొదటి కవిత.

ఆ కవితను పట్టుకుని భయంభయంగా తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లాడు నెరూదా-ఆ తర్వాత జరిగిన దానిని నెరూదా ఇలా చెప్పాడు.

"అప్పుడు మానాన్న అమ్మ భోజనాల టేబిల్ దగ్గర కూర్చొని వున్నారు. వాళ్ళేదో రహస్యంగా—పెద్దలు మాట్లాడే గాంభీర్యంతో మాట్లాడుకుంటున్నారు. నేను వణుకుతున్న చేతులతో నా మొట్టమొదటి కవితను ముందుకు జాచాను. మా నాన్న నిర్లక్ష్యంగా దానిని అందుకుని, నిర్లక్ష్యంగా దానిని చదివి, నిర్లక్ష్యంగా నా చేతికిచ్చివేస్తూ — "ఎక్కడినుండి కాపీ కొట్టేవు దీనిని?" అన్నాడ; అని వెంటనే మా అమ్మతో అతి ముఖ్యమైన విషయాల చర్చలో లీనమయిపోయాడు.

"అదీ నా మొదటి కవిత జనన వృత్తాంతం. అంతేకాదు — అశ్రద్ధతో, అనాలోచితంగా, బాధ్యతా రహితంగా సాగే సాహిత్య విమర్శను నేను తొలిసారి రుచి చూడడంకూడా అప్పుడే సుమండీ!" అంటాడు నెరూదా....

— ఎందరు రచయితల గాయపడిన మనసులకు అద్దం ఇది!!....

....ఆ తర్వాత—

ముప్ఫై యైదేళ్ళ వయసులో—కొత్త శిఖరాల నధిరోహిస్తున్న సమయంలో, వారం వారం 'ఎల్‌సోల్' అనే స్పానిష్ పత్రికలో తనను, అకారణంగా అదేపనిగా విమర్శిస్తూ వచ్చిన స్పానిష్ కవి జ్వాన్ రెమోన్ జిమెనేజ్ గురించి నెరూదా ఇలా అంటాడు:

"జిమెనేజ్ నాకు స్పానిష్‌వారి అసూయ గురించి నేర్పాడు. అతడొక గొప్ప కవి. అతడి కవితలు కాంతిపుంజాలు. అతడికి ఇంకెవరిని చూచీ అసూయపడాల్సిన అవసరం లేదు. అయినా తన్ను మించిన కీర్తి ఇంకెవరికయినా వస్తుందేమోనన్న భయం అతడికి వుండేది కాబోలు. గార్షియాలోర్కా, ఆల్బెర్టి, జోర్గ్ గుయ్‌ల్లెన్, పెద్రో సలినాస్—మొదలయిన యువకవులను చీల్చి చెండాడేవాడు. ప్రతి ఆదివారం ప్రచురించే తన విమర్శలో వాళ్ళ కవితలను హింసించేవాడు. నామీద కూడా వారం వారం విమర్శల పరంపర కురిపించేవాడు.

ఏది ఏమయినా అతడికి సమాధానం ఇవ్వకూడదని నిశ్చయించుకున్నాను. ఎప్పుడూ ఇవ్వలేదుకూడా. సాహిత్య విమర్శలకు ప్రతి విమర్శలు రాయడం నా కిష్టంలేదు. నేనా పని ఎప్పుడూ చెయలేదు—" — ఆకలిపక్కన, కన్నీటి పక్కన, అసహాయత పక్కన తన కవితా కవచంతో నిలబడిన మహాయోధుడు. పాబ్లో నెరూదా!

ఆ ఆశయం, ఆ సహనం, సంయమనం వుంటే ఈ నాటి మన సాహిత్య విమర్శలోని కొన్ని 'వాసన' వేసే అధ్యాయాలు ఆస లుండేవి కావేమో....

"యద్యదాచరతి శ్రేష్ఠః
తత్తదేవేతరో జనః" — మాన్యులు

ఎట్లా వ్యవహరిస్తారో సామాన్యులూ అంతే కదా—

ఈ సూత్రం మన ఈనాటి సాహిత్య దిక్పాలకులకూ, రాజకీయ పాలకులకూ వర్తించదు - అనుకుందామా? □





# పిల్లలే బుద్ధి చెప్పాలి



"అదేమిటి కోడలు పిల్లోయ్, ఎప్పుడూ లేంది అబ్బాయి మరీ ఇంత తెల్లారుఝామునే లేచి చిందులు తొక్కుతున్నాడూ! ఆ ఆఫీసరుగారికి గాని మళ్ళీ పెద్దమ్మవారు పూనిందా యేం?"

అని బామ్మ అమ్మని అడుగుతున్న ముక్కలు నా చెవిలో పడ్డాయి. అసలు అంతకు ముందే నాకు మెలకువ వచ్చేసింది. బాగా చలిగా వుంటే కప్పుకు పడుకున్నాను, నిద్ర నటిస్తూ. పెద్దాళ్ళ కబుర్లూ చేష్టలూ చాటుగా కనిపెడుతూ వుండడం మా పిల్లలకి బార్లూ పులి హారలూ.

"హెడ్డాఫీసునుంచి ఏదో పెద్ద ఘటమే యివాళ యినస్పెక్షనుకి తగలడుతుందిట. ఈ ముదనష్టపు పని అయిపోయేదాకా మరి వీళ్ళకి శవజాగారం తప్పదుకదా! అవునుగాని యింకా పాలవాడు అఘోరించినట్టు లేదు. మళ్ళీ వాడికి ఏం సంకటం వచ్చిందో, కాస్త వీధి చివరిదాకా వెళ్ళిరాగలదూ?"

అవసరాల రామకృష్ణారావు పెద్ద కథ

ఉచితం !!

# దివ్యశిల్పి

FREE !!

శిల్ప కలలో ఆ శిల్పి ప్రవీణుడు కాదు. అయినా, ఒక మంచి చలువరాతిమీద తన పని తనం ఆరంభించాడు. శిల్పకళలో సరియైన ప్రావీణ్యంలేదు కనుక అంత విలువగల చలువరాతిని అసంపూర్ణంగా విడిచిపెట్టేసాడు. ఆ రాయి వంద సంవత్సరాలపాటు ఎండకు ఎండి, వానకు తడిచి అలాగే పడి వుంది. అయితే 1501 సంవత్సరంలో మైకలాంజిలో అనే యువ శిల్పి ఆ చలువ రాయిని చూడటం సంభవించింది. ఆ రాయిని అన్ని కోణాలనుండి పరీక్షించి; లోపాలన్నీ గుర్తించినప్పుడు ఆయనకు ఆ చలువరాతిలో గొర్రెల కాపరి, మహా భక్తుడైన దావీదు రూపం చూచాయగా గోచరించింది. దానిని మనసులో వుంచుకొని శిల్పకళా ప్రవీణుడైన మైకలాంజిలో ఆ రాతిమీద తన పని ప్రారంభించాడు. మూడు సంవత్సరాల కఠిన దీక్షతో దాని లోపాలన్నీ సవరించి ఒక మనోహర సుందర విగ్రహాన్ని తయారుచేశాడు.

బుద్ధి హీనుడైన శిల్పకారుడు పనికి రాదని వదిలి వేయగా శిథిలమైపోతున్న ఆ చలువ రాతిని తన ప్రావీణ్యంతో ఒక అపూర్వ కళా ఖండంగా రూపొందించాడు. ఇంతకన్న గొప్పపని చేసే మరొక దివ్య శిల్పి ఉన్నాడు. అతడు నిర్జీవమైన రాతిమీద పనిచేయడుగాని, రక్త మాంస ములతో కూడిన సజీవంగావున్న మానవ హృదయాలమీద పనిచేస్తూ సాతాను మోసము వలన పాప వ్యాధులకు లోనై, శిథిలావస్థలో వుంటూ ఎవ్వరికీ, ఎందుకూ పనికిరాని బండరాళ్ళవంటి మానవ హృదయాలను తన కృపతో, ప్రేమతో తన దివ్య స్వరూపమునకు తీర్చి దిద్దుతున్నాడు. పాపమువలన తన దైవ స్వరూపాన్ని పోగొట్టుకున్న మానవుడు తన పాప స్వభావము నుండి విడుదల కలిగి, పావనమూర్తియైన దేవుని సేవించాలంటే పాపరహితుడైన ప్రభు అతన్ని స్పృశించి, అతని స్వభావాన్ని మార్చాలి. పాపములో మరణించిన పాపులను పునీతులుగాచేసి వారికి పునర్జన్మను ప్రసాదించె ప్రభుని గూర్చి తెలుసుకున్నారా !

| ఉచితం!! | ఉచితం!!! |
| --- | --- |
| కరుణామయుడైన యేసుక్రీస్తు జీవిత చరిత్ర, ఆయన కమనీయ బోధలు తెలిపే అందమైన పుస్తకం ఉచితంగా పొందదలచుకుంటే మీ చిరునామా ఈ రోజే మాకు వ్రాయండి. పోస్టు ఖర్చులు మేమే భరించి ఉచితంగా పుస్తకం పంపుతాము. | ఇదీ అడ్రస్ :<br>డా॥ ఎస్. జాన్‌డేవిడ్<br>ఫార్ కార్నర్స్<br>పోస్టు బాక్సు 315<br>విజయవాడ-2.<br>- FAR CORNERS |

**Gospel Message Inserted by Far Corners**



అని అమ్మ జవాబూ. ముసుగు సవరించుకుంటూ బామ్మ కదిలింది. కళ్లు నులుపుకుంటూ నేనిలా మంచం దిగేనో లేదో 'సూరిబాబు లేవాడా అండీ!' అంటూ ఎదురింటి చిట్టిబాబు ప్రత్యక్ష్యం. 'మిలట్రీకిగాని దరఖాస్తు చేస్తున్నారా ఏమిటర్రా, మరీ తెల్లారకుండా కవాతు ప్రారంభించి మమ్మల్ని కాల్చుకు తింటున్నారూ!' అంటుంది అమ్మ నవ్వుతూ.

చిట్టిబాబు మునిసిపల్ స్కూల్లో ఎనిమిదో క్లాసు చదువుతున్నాడు. నామీద ఎంత భక్తి వున్నా రోజంతా నాతో తిరగడానికి వాడికి కుదరదు. వాడిలాంటి వాళ్ళతో తిరగడం నాలాంటి వాళ్ళకి గొప్పతనమే. బొత్తిగా పొడుం కాయ అంతే వున్న నాకు, చిట్టిబాబులాంటి బుడంకాయ సైజు గాళ్ళు దొరకడం అదృష్టం కాదూ! కాని ఏం లాభం? ఎంత ట్రైచేసినా నాకా స్కూల్లో సీటుపుట్టించలేకపోయారు మా నాన్న. బొత్తిగా ఏ నవంబర్లోనో బదిలీ అయి వస్తే వాళ్లుమాత్రం ఎక్కడ ఖాళీ చూపించగలరూ?

"పెద్దాడికయితే ఇంజనీరింగులో సీటొచ్చి వేరే ఊళ్లో చదువుతున్నాడు, ఇబ్బంది లేకపోయింది. సమయం సందర్భంలేని మీ బదిలీలు కాదుగాని ఇప్పటికి యిది మూడోసారి, యిలా సూరిగాడి చదువు దెబ్బతినడం. ఇప్పటికే యింటి పట్టున కూచుని ఆడారి కబుర్లు వంట బట్టి పిల్లాడు నాశనం అయిపోయాడు. ఊళ్లో యున్ని స్కూళ్ళు అఘోరిస్తున్నాయి. కొంచెం దూరమైతే అయింది. ఎక్కడో అక్కడ గట్టిగా పట్టుబడితే దొరక్కపోదు. అంతా మీకు బద్ధకం. మరోసారి ప్రయత్నించకూడదూ!"

అని అమ్మ ఎన్నిసార్లు మొత్తుకున్నా నాన్న పట్టించుకున్నట్టులేదు. ఆ ఊళ్లోనే బ్యాంకులో పనిచేస్తూ, శలవలకో పండుగలకో మా యింటికి భోజనానికి వచ్చే మా అమ్మకి దూరపు చుట్టం, దీనికి జవాబు చెప్పేవాడు:

"ఇదిగో చెల్లెమ్మోయ్, నీ చిన్నకొడుక్కి యీ దిక్కుమాలిన స్కూళ్ళలో సీటు దొరకలేదని నువ్వేం గాభరాపడకు. పేరుకి పధ్నాలుగేళ్ళు వెళ్ళియో లేదోగాని ఏ పెద్దవాళ్ళకీ లేని జ్ఞానం మనవాడికుంది. కాస్త మంచి టీచర్ని చూసి ప్రైవేటు పెట్టిస్తివా రెండేళ్ళలో మెట్రిక్ స్టేట్ ఫస్ట్ కొట్టేస్తాడు. అమ్మో అలా కని పిస్తున్నాడనా, చీమ మిరపకాయ, సీమటపాకాయ!"

ఎవరేం అంటేనేం, యింట్లోనే వుండి ప్రైవేటుగా చదువుకోడంగానే ముగిలింది నా పని. మధ్యాహ్నం మూడు తర్వాత మేష్టారు వచ్చి ఓ రెండు గంటలపాటు చెప్పి వెళ్ళిపోతారు. నిజానికి పాఠాల విషయం ఎప్పుడూ నాకు బెంగ లేదు. మేష్టారు చెబుతున్నప్పుడే అంతా అలా జ్ఞాపకం వుండిపోతుంది. ఆయన ఎంత హోం వర్కు ఇచ్చినా ఓ గంటకన్న ఎప్పుడూ ఎక్కువ పట్టదు. నాకు వచ్చిన ఇబ్బంది చదువు కానే కాదు. ఆ మాటకొస్తే స్కూల్లో చదువుకునే పిల్లలే నా దగ్గిరకొచ్చి చెప్పించుకునేవారు. మరి! రోజంతా నాతో ఆడుకోడానికి ఎవరూ లేరు. ఏం తోస్తుంది! ఇప్పుడయితే పై ఊర్లో వుంటున్నాడు గాని యిక్కడ వున్నప్పుడయినా అన్నయ్య నన్నెప్పుడూ ఆటకి తీసికెళ్ళేవాడు కాదు, నాలాంటి 'గొటిక్కాయి'తో ఆడ్డం వాడికి నామోషీట. చెల్లెలితో ఆడుకోమంటుంది అమ్మ. ఒంటిమీద లాగు వుంటే విప్పేసేదాకా గుక్కపెట్టే పసిముండ, నా కర్మ కాలిపోనూ, అదా నా ప్లేమేటు!

మా బ్యాంకి మామయ్యే అనేవాడు:

"రచయిత అవుతాడో రాజకీయ నాయకుడే అవుతాడో నీ చిన్నకొడుకు, వీడు చూసే చూపులకి వీడు వేసే ప్రశ్నలకి తట్టుకోలేకుండా వున్నానమ్మోవ్, చెల్లెమ్మోయ్....అన్నిటికన్న ఆ భాషాజ్ఞానం వుందే...."

మావయ్య మాటలు ఎంతమటుకు నిజమో నేను చెప్పలేను. ఎప్పుడూ ఏదో ఒకటి అలా ఆలోచిస్తూవుండడం మాత్రం నాకు అలవాటయిపోయింది. ఒంటరితనం—అంటే తగిన పనీ పాటూ లేక అస్తమానూ ఒక్కణ్ణీ వుండవలసి రావడం—బొత్తిగా చికాకుగా వుండేది. 'అబ్బా, యింత చిన్న వయసులో యీ కుర్రాడికి ఎన్నెన్ని తెలివితేటలమ్మా!' అని అందరూ అంటూంటే అమ్మా బామ్మా మురిసిపోయేవారు.

నిజంగా అలాంటివి వుంటే గింటే అవి ఏం చేసుకోవాలో తెలియక ప్రాణం విసుగెత్తిపోయేది. అందులోంచి పుట్టినవే అనుకుంటాను యీ ఆలోచనలు.

ఈ పెద్దవాళ్ళు పిల్లలకి తగిన పని చెప్పరు. పోనీ మనమటుకు మనం ఏదో విధంగా కాలం గడుపుతూ వుంటే చూస్తూ ఊరుకోకూడదూ చెప్పండి, అడుగడుగునా రూల్సు ఒకటీ, 'అలా మాటాడకూడదు, ఇలా చెయ్యకూడదూ' అనుకుంటూ. ఏం చెయ్యాలో చెప్పరు, ఏం చెయ్యకూడదో అదే చెబ్తారు ఎక్కువగా. చెయ్యొద్దని ఎప్పుడైతే చెబ్తారో చేసి తీరాలని పిస్తుంది.

"బావా, నీ కొడుకు "టీనేజ్'లో పడ్డాడు. అందులో స్కూలుకి వెళ్ళకుండా యింట్లో ఎంత సేపూ కూచుంటే యీ వయసులో యింతటి 'బ్రిలియంట్ ఫెలో'కి ఎలాంటి 'డేంజరస్ ఇంప్రెషన్స్' అయినా పడవచ్చు. చెల్లాయి కంగారుపడుతుందని అలా చెప్పేనుగాని, సూరిబాబుని ఏదో ఓ ప్రైవేటు స్కూల్లో పడెయ్యడమే మంచిది."

అని ఆ మావయ్యే చెప్పబోతే,

"నేనూ అలాగే అనుకుంటున్నాను గాని, చూశావా, నాకు ఊపిరి పీల్చుకోడానికైనా టైం ఏదీ" అని నాన్న కొట్టి పారేశారు.

దాన్తో నా ఆలోచనా ధోరణికి ఏ అడ్డూ లేకుండా సాగింది. అయినా మా పిల్లలకి అడ్డేమిటి? పెద్దవాళ్ళు, 'చందమామ' చదువుతూంటే మేం 'వార పత్రిక సీరియల్స్' చదువుతాం. అన్నిరకాల సినిమాలూ యించుమించు అందరం చూస్తాం. ఒక్క ముక్కలో చెప్పాలంటే పెద్దలుచెప్పే నీతులే మాకు ఒళ్ళుమంట. బొత్తిగా మాటలురాని పాపాయికి కూడా ఏం చెబుతారో చూడండి. 'ఏదీ తప్పు చూపించమ్మా' అని కదా! ఆ పాప ముక్కుమీద నిలువుగా వేలుపెట్టి చూపిస్తే ఎంతో సరదా పడిపోతారు. 'ఏదీ ఒప్పు చూపించూ' అనరేం? దానికి ముక్కుమీద అడ్డంగా వేలు పెట్టే ఏర్పాటో ఏదో లేదేం?

నిజంగా వద్దన్నపని చెయ్యడంతో ఎంత హుషారు ఉందీ! 'ఇంటిపట్టునవుండి ఏం అల్లరి చేస్తున్నావురా సూరీ!' అంటుంది అమ్మ.

నాన్న కాగితాలు రాసుకునే బల్ల వుంది చూశారా, దాన్ని తలకిందులుగా చేసి పల్లకీగా మార్చి, అందులో చెల్లాయిని కూచోబెట్టి ఓ పక్క నేనూ ఓ పక్క రాంపండూ పట్టుకుని పెట్టిన కూత పెట్టకుండా అరుస్తూ, చెప్పులైనా విప్పకుండా వీధిలోని మట్టి అంతా యింట్లో చేరుస్తూ, వంట గదిలోంచి దేవుడి గదిలోకీ, ఓ పదిసార్లైనా ఊరేగందే ఎందుకండీ, మా రామదండు వుంది?


'ఓర్నాయయనో, సూరిబాబు తండ్రోయ్.... నువ్వు ఏదైనా చెయ్యిగాని, డాబామీద వేరే చేటలో దూరంగా ఎండబెట్టుకున్నాను చూశావూ, ఏవి, నా మాగాయి ముక్కలు. అవి మాత్రం ముట్టుకోకు. పెద్దదాన్ని. పళ్ళులేవు. ఏటికేడాదీ అవే నాకు ఆధారం. నా నోట్లో మట్టికొట్టకు నాయన్నాయన...."

అని బతిమాలుతుంద బామ్మ.

సరిగ్గా అదే మధ్యాహ్నం బామ్మ కునుకు తీస్తున్నవేళ డాబామీద కాళ్ళు కాలుతూ వుంటే ఆవిడ చెప్పిన ప్రత్యేకమైన చేటమీదే నిలబడి, పుల్లని ఓ ముక్క బుగ్గలోకి తోసి, ఆ రుచికి తట్టుకోలేక నోటిలోంచి ధారకట్టిన లాలాజలం చుక్క చుక్కా చేటని తడుపుతూండగా, అందులోని ఓ టెంక అందుకుని అక్కణ్నుంచి పక్క సందులోని స్వీపర్ కుర్రాడితో రింగ్ టెన్నిస్ ఆడుకోకపోతే ఎందుకంట మా కుర్రసజ్జు!

ఇలాంటివి ఏవో కొన్ని చిన్న చిన్న ముచ్చట్లు మేం చడీచప్పుడూ లేకుండా తీర్చుకోవాలని సరదాపడితే అనవసరంగా యీ పెద్దవాళ్ళే 'ఇల్లు తీసి పందిరి వేస్తున్నామని' మాకు లేనిపోని పేర్లు అంటగట్టడం బాగుందా!

మరి మా యింట్లో వాళ్ళే అలాంటివాళ్ళో లేక అందరు పెద్దవాళ్ళూ అంతేనో నాకు తెలీదుగాని, ఈమధ్య నెలలకొద్దీ యింటిపట్టున వుండిపోయి బాగా చూస్తే నాకు ఒక్కటిమాత్రం స్పష్టంగా తెలిసిపోతోంది.




ఎవరూ లేరనుకుని మా పక్కింటి పంతులమ్మ నూతిదగ్గర బట్ట తడుపుకుంటూ వుందనుకోండి. నేను పొరపాటున అలా వెళ్ళబోతే 'ఒరే పెధవా, తప్పుకాదూ అలా, ఆడాళ్ళు స్నానం చేస్తూంటే చూడొచ్చా? ఆంయ్" అంటాడు మావయ్య. నిజమే. నన్ను వెనక్కి తోసేసిన పెద్దమనిషి తను అక్కణ్నుంచి కదలక పోగా యింకా అటే అడుగులు వేస్తాడేం? అదేం పోయేకాలం!

అంటే, ఏవన్నమాటా?

పెద్దవాళ్ళం అయిపోతే హాయిగా కావలసినన్ని తప్పులు చెయ్యవచ్చునన్నమాట. తప్పులు చేసే స్థితికి ఎదగాలంటే ముందు పిల్లలంతా వీలయినంత త్వరగా పెద్దవాళ్ళుగా ఎదిగి తీరాలన్న మాట. ఇవన్నీ నేనూ, చిట్టిబాబూ మరికొందరం చిన్నవాళ్ళం రోజుల తరబడి ఆలోచించాం.

"ఒరే, ఎల్లకాలం యిలా మరీ చిన్నపిల్లల్లా మనం వుండిపోబట్టే కదరా పెద్దవాళ్ళకి లోకువయిపోయిందీ....అందుకని మనందరం ఏం చెయ్యాలంటే...."

"ఇక వేరే చెయ్యడానికేముందీ, పెద్దవాళ్ళుగా త్వరగా అయిపోయే అన్ని ప్రయత్నాలూ మొదలెట్టడమే!"

ఆ మాట గట్టిగా అనుకోడమే తడవు, మా జట్టు జట్టంతా శీతాకాలం అవనీండి, చీకటిపొద్దు కానివ్వండి ఆ తెల్లవారుఝాము నుంచే ఎక్సర్సైజు ఆరంభించాం.

ఇలా నేను చెప్పుకుపోతూంటే "యీ కుర్రాడికేం పనీపాటూ లేదుకాబోలు, అందుకే తీరి కూచుని యిలా పెద్దవాళ్ళమీద దండెత్తుతున్నాడు" అని మీరు అనుకోవచ్చు. దానికి నేనేం చెయ్యలేను. సరిగ్గా మాటలురాని మా చెల్లాయిని ఒక్కదాన్ని తప్పిస్తే మా యింట్లో పెద్దవాళ్ళందరి సంగతీ ఒక్కలాగే వుంది. మరి మీ అందరి యిళ్ళల్లో ఎలా వుందో చెప్పడం నా వల్లకాదు. మా ఫ్రెండ్సందరూ మాత్రం నేను చెప్పిందే రైటంటున్నారు.

ఇంతగా నాకు ఒళ్ళు మండిపోయిందంటే దానికి ముఖ్యకారణం మరొకటుంది. మా ఎదురింటి కాంపౌండరుగారి ఆఖరబ్బాయి వేణు అయిదో తరగతి చదువుతున్నాడు. వాడి తెలుగు వాచకంలో "పంచ సూత్రావళి" అనే చిన్న పాఠంవుంది. ఆ కుర్రాణ్ని వాళ్ళస్కూల్లో అవి

కంఠతాపెట్టి అప్పజెప్పమన్నారుట. ముందుగా నా దగ్గరికి వచ్చి అప్పచెప్పేవాడు. ముందే చెప్పేసుగదా ఓసారి చదివేస్తే వెంటనే ఏదైనా నాకలా గుర్తుండిపోతుందనీ .... వేణు వెళ్ళిపోయినా ఆ సూత్రాలు ఆలా వరసగా నాకు జ్ఞాపకం వుండిపోయాయి. అవన్నీ ఎంతవరకు మా ఇంట్లో పాటిస్తున్నారో మెట్టమొదట చూడ దల్చుకున్నాను. అందులో అన్నిటికన్న మొట్టమొదటి నీతి యిదీ:

"అబద్ధం తప్పరాదు."

అంటే అబద్ధం చెప్పకూడదని అర్థంట.

దేవుడి సృష్టిలో ఉపయోగం లేనిది ఏదీ లేదంటారుకదా, ఉపయోగించడానికి కాకపోతే మరి యీ అబద్ధం అనేది ఎందుకంట? వాడకపోతే ఏ పదమైనా, వస్తువయినా తుప్పుపట్టిపోదూ! అందుకే అనుకుంటాను మా యింట్లో పెద్దలందరూ దీన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో పాటిస్తారు!

"మీ వారికి ఎంత జీతం?" అని అడగనియ్యండి ఎవరైనా, మా అమ్మ సరిగ్గా రెట్టింపు చెబుతుంది.

"మీ వయసెంత వదినగారూ!" అని అడిగారనుకోండి ఏమాత్రం తడుముకోకుండా సరిగ్గా సగం చెబుతుంది.

"మీ యింట్లో ఎందరండీ జనం?" అని అడిగితే వచ్చే జవాబు ఎప్పుడూ ఆ సందర్భాన్ని బట్టి మారుతూ వుంటుంది. రేషన్‌కార్డు ఇస్తామని అడిగారనుకోండి. అప్పుడు మా కుటుంబ సభ్యులతోపాటు మా దాసీదీ దాని యిద్దరు పిల్లలూ, పాలవాడూ వాడి తల్లితండ్రులూ మాతో కలిసిపోతారు. అదే టైఫాయిడు యింజక్షన్ యిస్తామని వచ్చారనుకోండి. ఎప్పుడో పోయిన మా తాతగారి పేరుతప్ప, మా కుటుంబం మొత్తంమీద ఒక్కటంటే ఒక్క పేరు రికార్డుకి ఎక్కదు!

అయినా గాంధీ ఫొటో, రాముడివిగ్రహమూ మా అందరి ఇళ్ళల్లోనూ వుంటాయి. హరిశ్చంద్రుడి నాటకం అంటే పిల్లలతోపాటు పెద్దవాళ్ళకికూడా ఎంతో గురి. తన లేగదూడకి పాలిచ్చి, అన్న మాటప్రకారం పులి దగ్గరకి వచ్చిన ఆవుకథ మాకు ఉగ్గుపాలతో సహా నూరిపోస్తారు.

ఆ కథే ఓ పెద్ద అబద్ధం. ఏ పులి అయినా దగ్గరకొచ్చిన ఆవుని చంపకుండా విడిచిపెడుతుందా!

తక్కినవాళ్ళ మాటకేంగాని యీ విషయంలో మాత్రం మా అన్నయ్యకి పట్టుదల ఎక్కువ.

"అలా ఏపుగా ఎదిగిపోయాడు గాని మా పెద్ద మనవడికి పదిహేడు వెళ్ళలేదు."

అని మా బామ్మ ఎదురింటి దొడ్డమ్మగారితో చెబుతూంటే విని ఊరుకోలేకపోయాడు.

"మా బామ్మకి తెలీకే చెబుతూందో లేదా తన కంటికి మేం యింకా పిల్లలుగానే కనిపిస్తామో! మొన్న నాగులచవితికే నాకు పందొమ్మిది వెళ్ళిపోయాయండీ దొడ్డమ్మగారూ!"

అని ఆ మధ్య శలవలకి వచ్చినప్పుడు అన్నయ్య అంటూంటే ఎంతో ఆశ్చర్యమూ, ఆనందమూ కలిగేయి. అభిమానమూ గౌరవమూ పెరిగిపోయాయి, ఆ తర్వాతకూడా మళ్ళీ మళ్ళీ జాగ్రత్తగా పరిశీలించాను, ఒక్క నిజంకోసం దేనికైనా సిద్ధపడే మనిషి మా అన్నయ్యే అని అందరితోటీ గర్వంగా చాటేవాణ్ని.


ఆ రోజుల్లోనే చిన్న తమాషా జరిగింది.

మా వీధి చివర డాక్టరుగారొకరు వుండేవారు. వాళ్ళకి ఒకే ఒక అమ్మాయి. మా వీధిలోంచే రోజూ కాలేజీకి వెడుతూ వుండేది. ఓసారి ఆ అమ్మాయి మా అన్నయ్య కంట పడింది.

అంతకు ముందు శలవలకి వచ్చినప్పుడల్లా మా అన్నయ్య మధ్యాహ్నం భోంచేసి పడుకుంటే మర్రి నాలుగింటికే లేవడం. ఇప్పుడు నిద్రా గిద్రా జాంతానయ్, భోంచేస్తున్నప్పుడు కూడా ఎంతసేపూ వీధిమీదే దృష్టి.

అసలు ఆ వీధి గది మా బామ్మది. నడుం వాల్చినంతసేపు వాల్చి అదే కుక్కి మంచాన్ని ఆ వీధి గది కిటికీ ఎత్తుకువచ్చేలా కింద ఇటికెలు పెట్టుకుంటుంది. ఆందుమీద ఆ ఊచలు పట్టుకు కూచునేది. ఎప్పుడైనా అల్లరిపెడితే మా చెల్లాయికి తప్ప, మరొకరికి అక్కడ చోటు





లభించేది కాదు. మడిగట్టుకుని తను వేరే పెట్టుకున్న ఏ ఊరేసిన ఉసిరికాయనో ఆ బుగ్గనుంచి యీ చివరకి మార్చుకుంటూ, ఆ కిటికీలోంచే వీధిభాగం ఎంత కనపడితే అంత, గుడ్లు అట్నించి యిటు మారుస్తూ, చూస్తూ వుండేది. ఊరికే చూస్తూ వుండేదా? ఉహూఁ. ఏ రోజు మంచిదో ఏ రోజు కాదో అక్కణ్నుంచే చెప్పేది. ఏ కురుపుకి ఏ ఆకు నూరి వేస్తే తగ్గుతుందో అక్కణ్నుంచే సలహా యిచ్చేది. ఏ యిద్దరు దెబ్బలాడుకున్నా ఆ కిటికీలోంచే తీర్పు యిచ్చి విడిపించేది. నిజానికి అక్కణ్నుంచి దేశాన్ని పరిపాలించమన్నా ఆవిడ సిద్ధమే. అయితే అంత నిమషాలమీద ఆవిడకి అక్కణ్నుంచి బట్వాడా జరుగుతుందని మేం ఎవరం అనుకోలేదు!

ఆ వీధి గది మా అన్నయ్య ఆక్రమించేశాడు.

శలవలు అయిన తర్వాత తనకి పరీక్ష వుందనీ, ఆ గదిలోతప్ప చదువుకోడానికి మరో చోట బాగుండదనీ మా బామ్మతో మూడు రోజులపాటు పెద్ద దెబ్బలాట పెట్టుకుని ఆఖరికి సాధించాడు.

అంతేకాదు.

బామ్మ అటూ ఇటూ తిరుగుతూంటేనూ చెల్లాయి ఏడుస్తూంటేనూ తన చదువు పాడయిపోతోందని ఇలా భోజనాలు అయిపోతాయో లేదో అటు వీధిలోకి వచ్చేసి ఇంకెవరూ ఇటు రాకుండా వీధివైపు తలుపు గడియపెట్టేసేవాడు.

మా ఎదురింటి చిట్టిబాబుకికూడా క్రిస్మస్ శలవలే మరి. ఇంట్లో ఆడాళ్ళతోపాటు యీ విడిఖైదు అనుభవించడానికి నాకేం ఖర్మం! భోజనం అవగానే పుస్తకాలు తీసుకుని ఎదురింటి చిట్టిబాబుగారి మేడ ఎక్కేసేవాణ్ని. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న డాక్టరుగారమ్మాయికి మాత్రం ఏవో ప్రయివేటు క్లాసులో ప్రాక్టికల్సో వుండేవిట. ఒక్క ఆదివారం తప్ప ఇంచు మించు ప్రతిరోజూ ఆ వీధిలోంచి వెళ్ళేది. ఆ మేడమీద కిటికీలోంచి కిందకి చూస్తే నాకూ చిట్టిబాబుకీ రోజుకో కొత్తరకం సినిమా కనిపించేది.

అన్నయ్యా, నువ్వేదో పెద్దఆదర్శప్రాయుడవనుకున్నాను! ఇంట్లో అబద్ధం ఆడని పెద్ద మనిషివి నువ్వొక్కడవయినా వున్నావని సంబరపడ్డాను. పాపం ఆ ఆడకూతుళ్ళని వెర్రివాళ్ళని చేసి యిదా నువ్వు చేసే పని! పాపం

పీకు పరీక్ష వుందా? దానికోసం మధ్యాహ్నం ఓ రెండుగంటలయినా చదివి తీరాలా! ఏమాత్రం డిస్టర్బైనా పనికిరాదూ? ఇంతకీ మా అన్నయ్య ఎన్నివిధాలుగా ట్రైచేసినా ఆ అమ్మాయిని ఒక్క మాటయినా మాట్లాడించలేక పోయాడు. ఆ తర్వాత మా యింట్లో ఏదో మాటలో మాటొచ్చి 'పాపం, ఎంత చక్కగా వుంటేనేం, భగవంతుడు ఏదో ఓ కొరత పెడుతూ వుంటాడు, ఆ డాక్టరుగారమ్మాయి మూగట కదూ!' అనుకున్నారు.

ఆ మాట మా అన్నయ్య చెవిలో పడనే పడింది. 'ఇక్కడ నా చదువేం సరిగ్గా సాగడం లేదు' అంటూ ఇక నాలుగు రోజులకి కాలేజీలు తెరుస్తారనగానే రైలెక్కేశాడు! ఇంకేం సాగుతుందీ?

ఆ మర్నాటినుంచీ మళ్ళీ మా బామ్మ తన రాజ్యం తను ఏలడం ఆరంభించింది. ఇక ఆ వీధిలో హడావిడికి ఏం లోటు? దేశాన్ని పాలించే స్థితికి ఎక్కడ ఎదిగిపోతుందో అని, చెప్పకేం, నాకు బెంగ పట్టుకుంది!

క క క

"అసభ్య పదములు ఉచ్చరించరాదు"—— అంటే ఏమిటీ? అని ఓనాడు వేణుగాడు నన్ను అడిగాడు. ఎంత ఆలోచించినా నాకూ తెలీలేదు. కాని నాకూ తెలీలేదంటే నన్ను ఎంతో పెద్దగా చూసుకుంటున్న కుర్రకుంక వాడు బాధపడతాడు కదా! అందుకని ఓ ఉపాయం ఆలోచించాను. 'చూడు వేణూ, ఇప్పుడు అర్జంటుగా నేను మార్కెటుకి వెళ్ళాలి. ఇంట్లో పంచదార అయిపోయింది. సాయంకాలం రా, తప్పకుండా చెబుతాను' అని వాణ్ణి పంపించేశాను. ఈలోగా అదృష్టవశాత్తూ మావయ్య మా యింటికి వచ్చాడు.

"ఏంరా బృహస్పతీ, మొహం అలా పెట్టేవ్, మళ్ళీ ఏం అనుమానం వచ్చిందేం?" అని అడిగాడు.

"అసభ్య పదములు అంటే ఎలాంటివి మావయ్యా?"

"ఇదిగో ఇలారా చెబుతాను"

అంటూ గబగబా రెండక్షరాల పదాలుకొన్ని చెవిలో ఊదేడు. 'ఛ, ఛ తప్పుకాదూ, అలాంటి మాటలు అనొచ్చా?' అని పైకి అన్నా, 'మరో సారి ఆ ముక్కలు చెవిలో పడితే ఎంత బాగుణ్ను! నామటుకు నేనే నా నోటితో ఆ తేనె చినుకులు వల్లిస్తే ఎంత హాయిగా వుండును!' అని మాత్రం మనసు పీకకపోలేదు. నాకే కవిత్వం వస్తే

భాషా ప్రవీణా! వన్నుమోరు
స్వేచ్ఛాజీవీ! జోహారు

అని గేయాలు అల్లుదునేమో! ఇంతకంటే ఇప్పటి తెలుగు సినిమా పాటలు బాగున్నాయా అని!

"ఎందుకురా అలా వెర్రెత్తినట్టు చూస్తావ్? అసభ్య పదములు అంటే యిప్పుడు నేను ఉదాహరణలు యిచ్చానుకదా, ఏక సంతాగ్రాహివి నీకు బోధపడిపోయే వుంటుంది. సులువుగా చెప్పాలంటే బూతుమాటలు అన్నమాట పూర్వకాలపు వెర్రివాళ్ళు వర్ణక్రమం పిల్లలకి నేర్పేటప్పుడు "అమ్మ, ఆవు" అంటూ మొదలెట్టేవారు. ఇప్పటి పిదపకాలపు పిల్లలకి ఒకళ్ళు నేర్పక్కర్లేదు. బురద గుంటల్లోంచి దోమల సంగీతం దానికదే పుట్టుకొచ్చినట్టు ఒకరు చెప్పకుండా వాళ్ళమటుకు వాళ్లే మొదలెడుతున్నారు, "అమ్మా, ఆలీ" అంటూ.

అని పెద్దగా నవ్వుకుంటూ వెళిపోయాడు!

ఎందుకైనా మంచిదని మా యింట్లో చిన్న తెలుగు డిక్షనరీ వుంటే తీసి చూశాను. అసభ్య పదములు అంటే కేవలం లంజా, లఫ్డీ, ఇలాంటివే కాదుట, వినడానికి అసహ్యం కలిగించే కఠినమైన అన్నిరకాల అనకూడని మాటలూ అందులోకే వస్తాయిట. తాగుబోతు పేలాపన ఒకటేకాదుట, మనం మాటాడుకునే మాటల తీరు చాలావరకు అసభ్యకరమైనదేనుట. నాకేం సరిగ్గా బోధపడలేదు. ఆ తర్వాత ఒకే ఒక్కరోజు జాగ్రత్తగా చూశాను. మా వాళ్ళ ధోరణి అలాగే వున్నట్టుంది సుమండీ!

"తలుపు తియ్యవే" అని నాన్నగారు ఎప్పుడూ పిలవడు.



"ఎక్కడ చచ్చావే దరిద్రపు ముండ!" అంటారు.

"ఎందుకలా అరుస్తారు?" అని అమ్మ అడగదు.

"దెయ్యంపట్టినట్టు ఎందుకా గింజుకోడం?" అంటుంది.

"చిన్న విషయానికి ఎందుకలా పోట్లాడుకుంటారు?'' అని సర్దిచెప్పాలని బామ్మ అభిప్రాయం అయివుంటుంది. కాని పైకి చెప్పే తీరుమాత్రం అలా వుండదు.

"తద్దినం మంత్రం చదివినట్టు అలాగేనుట్రా అబ్బాయీ పెళ్లాన్ని పిలవడం? పోనీ వాడు మొగాడూ, ఏదైనా అన్నాడే అనుకో, పూనకం వచ్చినదాన్లా అలాగేనుటే మీద పడడం! సంసారాలంటే ఇలాగేనా, ఎంత సరసంగా అఘోరించాలీ!

ఇదిగో ఇంత మృదువుగా మాటాడుకుంటారు మావాళ్ళు.

"ఆ హెడ్మాస్టరు చచ్చినాడు మా పిల్లాడ్ని ప్యాసు చేశాడుగాదు"

"ఆ నర్సుముండ వస్తానని దగాచేసింది"

"ఆ కంట్రాక్టరు దరిద్రుడు ఓ పట్టాన దొరికి చస్తేనా?"

"ఆ తాసిల్దారు ముండాకొడుకు పెర్మిటు ఇచ్చాడు కాదు"

ఇలా ఎవరిగురించి యింట్లో చెప్పుకున్నా చివర్న ఓ ఆభరణం తగిలించి మరీ చెప్పుకుంటారు.

బూతుమాటల లాంటివే ఇంత మధుర మధురంగా వుంటే, బూతుదృశ్యాలు అవెంత కన్నుల పండుగగా వుంటాయో! అవి పెద్ద వాళ్ళకి మాత్రమే చూడ్డానికి అవకాశం యిస్తారుట. అలా ఇచ్చిన సినిమా పెర్మిషన్‌కి 'ఏ సర్టిఫికేటు' అంటారుట. అంటే అడ్డమైన బట్టిప్పుకున్న బొమ్మలూ చూడ్డానికి పెద్దవాళ్ళకి మాత్రమే లైసెన్సు వుందన్నమాట.

ఇంతకన్న ఘోరం వుందా ప్రపంచంలో!

మాకు ఏ అవకాశాలూ లేకుండా చేసి, కొన్ని నీతులుచెప్పి, నోరునొక్కి ఇంట్లో కూచోబెట్టి, 'బాలల సంవత్సరం' అంటూ మమ్మల్ని మోసం చేస్తారా!

మాకేనా అంత తెలివితేటలు లేనిది?

క క క

"చూడు సూరీ, తల్లి అంటే ఎవరనుకున్నావ్, సాక్షాత్తూ దైవస్వరూపం. పదినెలలూ నిన్ను మోసి, కని, ఎన్నో కష్టాలకోర్చి నిన్ను యింతటివాణ్ని చేస్తుంది. అవిణ్ని అలా కష్ట పెట్టవచ్చునా?"

అని ఓనాడు నాన్నగారు నన్ను కూచోపెట్టుకుని బోధించారు. ఆ ముందురోజు ఎవరో స్నేహితురాళ్ళుట, మధ్యాహ్నంవేళ అమ్మని చూడ్డానికి వచ్చారు.

వాళ్ళొ వచ్చేసరికి మా చెల్లాయి నానా అల్లరీ పెట్టేసింది. అప్పుడే లేచిందేమో ఎన్ని విధాల ఊరుకోబెట్టినా లొంగలేదు. 'చూడు సూరీ, దీన్ని కొంచెం అలా వీధిలో తిప్పి ఆడించమ్మా!' అని అమ్మ చెప్పిన మాట నిజమే. కాని ఆ రోజే ఏవో కొత్త ఫిల్ము ముక్కలు కొట్టుకొచ్చాననీ అద్దం సినిమా వేసుకుందాం రమ్మనీ పక్కవీధి ఫట్ ఫట్ ఖాన్ కబురంపించాడు. వీధి పిల్లలందరూ ఎప్పుడో అక్కడికి చేరేరుట. 'గురూ, జరూర్' అంటూ అప్పుడే మూడోసారి 'మాకు మాత్రమే బోధపడే ఈల సందేశం' పంపించాడు చిట్టిబాబు. ఇంకెలా తట్టుకోను! అయినా వచ్చిన ఆడాళ్ళిద్దరూ రాడార్సులా వున్నారు. ఇటు మా అమ్మకాక బామ్మ ఒకతిగదా! ఎంతసేపూ 'మీ యింట్లో యివాళ ఏం వండుకున్నారు వదినా!' అని సాగదీసుకుని మురిసిపోకపోతే నలుగురు పెద్దాళ్ళు వున్నారు, ఒక్క పసిముండని దార్లోకి తెచ్చుకోలేరూ?

ఇలాంటి చోట వాదించి లాభంలేదని ఇదివరకటి నా అనుభవమే పాఠం చెప్పింది. అంతే. చల్లగా పలాయన మంత్రం పఠించాను, పెరటి దారిన.

సహజంగా అమ్మ నాన్నగారికి కంప్లెయింటు ఇచ్చి వుంటుంది. దాని ఫలితమన్న మాట ఈ పాఠం.

"....అందుచేత నేను చెప్పేదేమిటంటే మీ అమ్మ పని చెప్పినప్పుడు సాయం చెయ్యి

గాని అలా పారిపోకు. తల్లిని ఏడిపించవచ్చునా, ఏం చెబుతున్నారు మీ స్కూల్లో?...."

నేను చెప్పలేను. ఎందుకంటే నేను స్కూలికి వెళ్ళడం లేదుగదా! వేణుగాడి స్కూల్లో మాత్రం ఈ పాఠం బోధిస్తూ వుండి వుండవచ్చును.

అవును.

హఠాత్తుగా నాకు గుర్తొచ్చింది. వేణుగాడి తెలుగు వాచకంలోని పంచ సూత్రావళిలో మూడోది ఇదే "కన్నతల్లి మనసు కష్టపెట్ట రాదు."

"ఛ. ఎంత పొరపాటు చేశాను. పొద్దుట్నుంచీ రాత్రిదాకా అలా యింట్లో అందరికీ చాకిరీ చేస్తూనే వుంటుంది అమ్మ. ఎప్పుడో మరీ తప్పనప్పుడు తప్ప, నాకు పనే చెప్పదు. పాపం చెల్లాయి ఎంత ఏసిగిస్తే నామీద నాన్నతో చెప్పిందో! ఇంటిలో నాకేం పనా పాటా? ఈ రోజు మొదలు అమ్మ అడక్కుండానే సాయం చెయ్యాలి."

అని నిమషాలమీద నిశ్చయానికి వచ్చేశాను.

దానికి తోడు ఆ రాత్రి అమ్మా నాన్నతో 'మాతృ దేవత' సినిమా చూశాను నేను. అందులో ఆ కన్నతల్లి పడిన కష్టాలు చూస్తే నా కన్నీళ్లు ఆగలేదు. కొంత సేపటికి ఎలాగో ఆపుకుని అటూ ఇటూ చూశాను. సినిమాహాలు సినిమా హాలంతా ఏకమొత్తంగా ఏడుస్తోంది. అందరికంటె దుఃఖం పట్టలేకపోయింది మా నాన్న. అమ్మ దెబ్బలాడింది. "ఊరుకోండీ మరీ అలా బెంబేలు పడిపోతే ఎలా? పైకలా రాయిలా కనిపిస్తారుగాని మీ నాన్న మనసు ఉత్తి వెన్న సూరీ!" మరోసారి ముగ్గురం కలిసి బావురుమన్నాం.

ఆ రాత్రి చెల్లాయీ అమ్మా నాన్నా వేరే గదిలో పడుకున్నాక, నేను బామ్మ పక్కలో కూచుని 'కొంచెం గోకవూ?' అన్నాను. 'నువ్వూ సినిమాకి వస్తే బావుణ్ను బామ్మా! చెల్లాయి ఎక్కడ లేచి ఏడుస్తుందో అని ఇంటిలో వుండిపోవాలా? ఆ ఏడుపేదో దాన్తో కలిపి అందరం అక్కడే ఏడుద్దుంకదు! నిజంగా చాలా గొప్పగా ఏడిపించారు. అంత బాగా తీశారనుకో.'

అని సినిమాకథ టూకీగా చెప్పేను.

"నాన్నగారు అంత కోపంగా కనిపిస్తారా పైకి, ఆ సినిమాలో తల్లి బాధలు చూడలేక అంత మనిషీ కుంగిపోయారనుకో."

బామ్మా ఆశ్చర్యంగా చూసింది నమ్మలేనట్టు.

"నిజం బామ్మా, సరస్వత్తోడు. అందరూ మానేసినా ఇంకా చాలాసేపు నాన్న వెక్కి వెక్కి ఏడుస్తూనే వున్నారు!"

"ఊళ్ళోవాళ్ళ తల్లులందరి బాధా పాపం మీ నాన్నదే, ఇంటిలో వున్న కన్నతల్లి ఎలా చచ్చినా బాధలేదుగాని!"

నే అనుకున్నవి అబద్ధాలుచేస్తూ బామ్మ యింకా చాలా చెప్పింది.

"నువ్వింకా చిన్నవాడివి, చెప్పినవన్నీ సరిగ్గా అర్థమవుతాయోలేదో! పోనీ జ్ఞానం వచ్చిన ఆ పెద్ద మనవడి ముందు మొరపెట్టుకుందామంటే వాడికి పై ఊళ్ళో చదువాయె. ఇంటిపట్టున వున్న రోజుల్లో అయినా వాడికీ నాకూ పడి చావదాయె. ఇక కోడలంటే అది పైదీ. దానికేం వీపా కడుపా? ఇంకా ఆ మాటకొస్తే అదే నయమేమో! నడుం వంగిన దాన్నని నా మీద దయదల్చి పాపం యింటి చాకిరీ అంతా ఇంచుమించు అదే చేసుకొస్తోంది. ఏమైనా పై ఇంటిపి మన ఇంటిదెందుకవుతుందీ? చూసి చూసి నా సిగ్గు చిమిడిపోనూ, నా బాధ దాన్తో ఏం చెప్పుకోనూ" అందుకని నీతో చెప్పుకోక తప్పలేదురా సూరీ యివాళ! అదైనా తెలిసో తెలీకో నువ్వే కదిపేవు కాబట్టి."

అంటూ నా వీపు గోకుతూ బామ్మ ఇంకా యిలా చెప్పుకొచ్చింది: 'కన్నకొడుక్కి లేక పోయింది, యిక గుంటవెధవ్వి నీతో చెప్పుకుని ఏం లాభం! అంతా నా భ్రమ. ఏ మంచీ చెడ్డా కావలసివచ్చినా వీధి వీధంతా నన్ను అడుగుతారు. ఇంట్లో మాత్రం నాది కుక్క బతుకు....'

అవతలి గదిలో జోడు గుర్రాల స్వారీ విని పించింది. అంటే మా అమ్మా, నాన్నా పోటీ



పడి గుర్రుపెడుతున్నారన్నమాట. అది వినడ మేమిటి, బామ్మ లేచి కూచుంది. రంగంలోకి దిగిపోయింది, 'ఇటు తిరుగు ఇంకా సరిగ్గా గోకుతాను' అంటూ బామ్మ సినిమాకి రాకపో డానికి కారణం చెల్లాయి కానే కాదుట. ఆ ముండ రోజంతా నానా న్యూసెన్సూ చేసినా పిట్టలతో పడుకుని పువ్వులతో కళ్లు విప్పుతుం దిట. బామ్మకి యిప్పుడు కళ్ళు సరిగ్గా కన పడ్డం లేదుట. ఎన్నిసార్లు చెప్పినా నాన్నగారు కళ్ళజోడు కొనరట. దానికి ముందు కళ్ళు పరీక్ష చేయించుకోవాలిట. అదంతా 'బోలెడంత తతంగమూ కప్పెట్టినంత ఖర్చు'ట.

'ఈ బాధంతా యీ రోజుల్లో యెవరుపడ తారు నాయనా? నన్నిలాగే వుంచేస్తే, మీ నాన్నకి సినిమా టిక్కెట్టు ఖర్చు కలిసొస్తుంది గదా! ఏదో యింకా తన్ని తగలెయ్యకుండా యింత ముద్ద పెడుతున్నాడు, అదెంత కాదు, ఏమంటావ్?'

"నిజమేగాని గోకడం స్పీడు యెక్కువ చేశావ్. మంట పెడుతోంది. ఇంకా సరిగ్గా గోకక్కర్లేదు తగ్గించు బామ్మా!"

నా మాటలు ఆవిడ వినిపించుకున్నట్టు లేదు. ఇటు నోటితో పాటు అటు చేతికీ పని యెక్కువ చేస్తూనే వుంది. నేను 'అమ్మోయ్' అంటూ లేచి కూచుని ఆవిడ రెండు చేతులూ పట్టుకున్నాను.

కాస్సేపటికి చెప్పవలసినవేవో పులిస్టాపూ కామా లేకుండా పూర్తిచేసి, బామ్మ అలసి పోయి నిద్రపోయింది. నాకు మాత్రం నిద్ర పట్టలేదు. ఆ ఊపున దెయ్యం బరికినట్టు వీపంతా గోకేసిందేమో ఒకటే మంట. అది గాక ఆవిడ చెప్పిన భోగట్టాకి తట్టుకోలేక పోయింది నా మనస్సు. అన్ని రకాల కురదా ఒక్కమారే వదిలిపోయింది.

నాన్నకి ఎనిమిదేళ్ళుండగా తాతగారు పోయా రట. పాపం బామ్మే అష్ట కష్టాలు పడి నాన్నని చదివించి యెవరో తెలిసినవాళ్ళ కాళ్ళు పట్టుకుని ఉద్యోగం వేయించిందట. ఇప్పుడు మేం వుంటున్న యిల్లు బామ్మకి వాళ్ళ వాళ్ళు యిచ్చిందట.

"ఏదో మాట వరసకి నువ్వు అడిగావని అన్నానుగాని సూరీ, కాటికి కాళ్ళు చాచుకున్న ముండని సినిమా చూడాలని నాకేం ఏడుపులేదు సుమా! వారం వారం కోవెలకి వెడతాను. అరటిపళ్ళూ ఉదొత్తులూ అన్నీ కలపి మహా అయితే రూపాయి అవుతుంది. 'నెలకి అడ క్కుండా నా మొహాన్న అయిదు రూపాయలు పడెయ్యరా' అని బతిమాలాను. ఇచ్చిన నెల యిస్తాడు, యివ్వని నెల యివ్వడు. ఏం చెప్ప మన్నావు మీ నాన్నగారి మాతృభక్తి!"

అనే బామ్మ మాటలు నా చెవిలో గింగురు మంటున్నాయి.

'కన్నతల్లి మనసు కష్టపెట్టరాదు' అంటే సినిమా చూసి చీదిపొయ్యడం వరకేనా?

* * *

ఒక్క నాన్నగార్నే కాదు, అన్నయ్యని చూస్తేకూడా నాకు ఓ విషయం బాగా తెలి సొచ్చింది. ఇంట్లో ఆడాళ్ళు ఎంత చాకిరీ చేసినా మొగాళ్ళ మాటే చెల్లాలి. ఆ సంగతి గ్రహించిన దగ్గర్నుంచీ నాకు మా అమ్మా బామ్మా అంటే గౌరవం ఎక్కువైపోయింది. వాళ్ళు చెబితే మాత్రం ఏ పనైనా వెంటనే చేసెయ్యాలి అనుకున్నాను. అయితే మొగా ళ్ళయితేనేం, ఆడావాళ్ళయితేనేం ఈ పెద్ద వాళ్లు అంత సులువుగా మాట దక్కనిస్తారా!

"సూరిబాబూ! పంచసూత్రావళిలో నాకు నాలుగో పీతి వచ్చేసింది సుమా!" అన్నాడు వేణుగాడు ఓనాడు.

"ఏదీ అప్పజెప్పూ!" అన్నాను.

"మరి పుస్తకం పట్టుకుచూడూ కరెక్టో కాదో!"

"అక్కర్లేదు అప్పజెప్పవయ్యా అంజ నేయా!" అన్నాను. చెప్పేడు. "లేని వారిని నీచముగా చూడరాదు."

రైటే. దాన్ని అచరణలో పెట్టడంలో మా పిల్లల వరకూ కరెక్టే. ఈ మధ్య మూడేళ్ళయి వరసగా కుదర్లేదుగాని అంతకు ముందు నేనూ హాయిగా అందర్తో పాటు బడికెళ్ళేవాడినే. అదంతా నాకు గుర్తు వుండనే వుంది. వీడు డబ్బున్నవాడనీ, వీడు డబ్బు లేనివాడనీ

యేమాత్రం తేడా లేకుండా ఒకే బెంచీమీద కూర్చుని చదువుకునేవాళ్ళం. స్కూలుకి వెళ్ళినా వచ్చినా జటపటాలు వేసుకునేవాళ్ళం. ఇప్పుడూ మేం ఆడుకునేటప్పుడు యిలాంటి భేదాలు యేవీ పాటించం. పెద్దగా ఎంగిలి పట్టింపులు కూడా మా పిల్లల్లో వుండవు.

"పెద్దవాళ్ళలో మాత్రం అలాంటి తేడా లెక్కడున్నాయి?" అని కోతలు కొయ్యకండి. మీ తేడాలన్నీ అలా యేర్పడ్డవే.

"ఒరే రిక్షా కడతావా?" అని అడుగుతారు.

"ఎక్కడకి వెడతారండీ!" అంటాడు వాడు.

చూశారా? మీరు యెక్కేవారు. అందుకనే 'ఒరే' అన్నారు. వాడు తొక్కేవాడు. అందుకనే 'అండీ' అంటున్నాడు. ఇదంతా యేదో మామూలు విషయమైపోయి ఎవరైనా గుర్తు చేసేదాకా మనకి తెలీడం లేదు.

ఈ నీతి గురించి ఆలోచిస్తూ ఒక్కరోజు చూశానో లేదో మా యింట్లోనే ఎన్ని చిత్రాలు బయటపడ్డాయని?

వంటచేసే మా అమ్మ అన్ని సదుపాయాలూ వున్న శుభ్రమైన వంట గదిలో చెప్పు లేసుకుని నిలబడి, గ్యాస్‌స్టవ్ మీద కుక్కర్ మీద వండుతుంది. అంట్లుతోమే అప్పలమ్మ పాకీదొడ్డి పక్కన యిటికమీద చతికిలబడి మేం తిని విడిచిపెట్టిన యెంగిలి గిన్నెలన్నీ తోమి, కడిగి, తుడిచి యిస్తుంది. అమ్మ కష్టానికి పాకెట్ మనీగా నూర్రూపాయలూ, అప్పలమ్మ చాకిరీకి పదిరూపాయలూ నాన్నగారు యిస్తారు.' బాగుంది. ఎక్కడైనా అమ్మా, అప్పలమ్మా ఒకటౌతారా?' అని అడుగుతారు యెవరైనా. కావాలని కాదు. నిజంగా అమ్మ చేసేది అంత గొప్ప పనీ, అప్పలమ్మది అంత పనికిమాలినదీ అయితే, ఒక్కరోజు అది నాగా పెడితే అంత గోలచెయ్యడం దేనికి? నాన్నగారు నెలకి మూడు నాలుగయినా క్రెంచి లీవులు పెట్టేస్తూ వుంటారట. దిక్కులేని దాసీముండ తన కొడుకు యెక్కడికో పారిపోయాడని ఒక్కరోజు సెలవు పెడితే అంత అల్లరా!

"అవునే అప్పలమ్మా! పోనీ పోనీ కదా అని ఊరుకుంటే నాకు జవాబు చెప్పేటంతగా నువ్వు తయారయ్యావా?"

అంటూ అమ్మ తగులుకుంది కదా, మరి చెప్పలేను.

"పోనీ యే రోగమో వస్తే అదో మాట. గుంటవెధవ యెక్కడికో పారిపోయాడనీ, వెదికి తీసుకొచ్చానని నువ్వు చెబితే నమ్మాలి మేము. అనుమానంవచ్చి ఆ మాట అన్నామో "మీకు మాత్రం యిబ్బందులు రావా అమ్మగారూ!" అంటూ ఎంత మాట పడితే అంత మాట అనెయ్యడానికి సిద్ధం. అవునే, మాదే తప్పు. పాచిపనిచేసే జాతి మీది. ఎంగిలి మెతుకులు యేరుకునే బతుకులు మీవి. మిమ్మల్ని అలాగే వుండనియ్యక కాఫీలూ టిఫిన్‌లూ యిచ్చి మాతో సమానంగా చూసుకోడం తప్పు కాదూ! పాత చీరలూ అవీ పడేసి అందలం యెక్కించడం నేరం కాదూ?" అంటూ ఛెళ్ళా ఛెళ్ళా లెంపలు వాయించుకుంది. పాపం గుడ్డపీరు కుక్కుకుని, ఎంతో పెద్ద తప్పు చేసినదాన్లా అప్పలమ్మ అక్కడే నిలబడిపోడం యెప్పుడూ గుర్తుంటుంది నాకు. డబ్బులేనివాళ్ళని యింతగా అవమానిస్తూ 'లేనివారిని హీనముగా చూడరాదు' అని సూత్రాలు వల్లించడానికి మన పెద్దవాళ్ళకే చెల్లింది.

* * *

మనిషి యెలా వుంటుందని నన్ను అడక్కండిగాని మా బామ్మ గొంతుక మాత్రం చాలా బాగుంటుంది.


ఎమ్. ఫిల్. చేసింది ఆవిడ.

అంటే మూడో క్లాసు ఫేలయింది.

అలాంటిది అన్ని పద్యాలు అంత స్పష్టంగా యెలా వచ్చాయో!

భాగవతంలో కిష్టుడి కొంటె చేష్టలు వర్ణించే పద్యాలు మరీ బాగా చదువుతుంది.

"ఓ యమ్మ నీ కుమారుడు
మా యిండ్లను పాలు పెరుగు మననీ
డమ్మా!"




అనే పద్యం చదువుతూ వుంటే భక్తి పారవశ్యంతో ఆమె కళ్ళు మూతలుపడిపోతాయి. అలాంటి ఒకానొక సమయం కనిపెట్టి "ఎందుకురా ఆ దొంగ బుద్ధులూ, అడిగితే నేను యివ్వనూ!"

"ఇవ్వవనా! అదో సరదా! అందులో ఎంత మజా లేకపోతే ఆ కిష్టుడే యిలాంటి పన్లు చేస్తాడూ? ఇంతకీ యిరుగు పొరుగు యిళ్ళల్లో దొంగతనాలకి నేను బయల్దేరలేదు కదా! మరి కాస్త పెరుగు వెయ్యమంటే యింట్లోనే వెయ్యరే, యిక మా కుర్రాళ్ళం యేం కావాలని?"

"ఆఖరికి ఆ కిష్టపరమాత్మని యెత్తిపెట్టేదాకా వెళ్ళిందిట్రా నీ బుద్ధి, అవ్వ! యింట్లో వుంటే పాడైపోతాడని మీ నాన్నకి యెంత చెప్పినా వింటేనా?"

అంటూ బుగ్గలు నొక్కుకుంది.

"తప్పు నాయనా, ఆలోచించకుండా, మాటాడకూడదు. కిష్టపరమాత్మ యేంచేసినా మనకి తెలీని యేదో అర్థం వుంటుంది. అవన్నీ అవతారపురుషుడి లీలలు."

"అవున్లే, జైల్లో పుట్టినవాడికి దొంగబుద్ధులు కాక మరేం అబ్బుతాయి?"

బామ్మ కొట్టబోతే నేను తప్పించుకుని నవ్వుతూ దూరంగా నిలబడ్డాను.

"నోటి కెంతొస్తే అంతా అనెయ్యడమే! లెంపలేసుకో. కళ్ళు టప్పున పేలిపోగలవు. మళ్ళీ చదువుకూడా చెబుతున్నావు ఎందుకూ? మీ పంచసూత్రావళిలో ఆఖరి నీతి ఏమిటీ? "దొంగతనము చేయరాదు" అని కాదూ? మనదికాని వస్తువుని కోరడం, దొంగిలించడం మహాపాపాలలో ఒకటి. ఇదెప్పుడూ మరచిపోకు."

ఎలా మరచిపోతాను?

అంత గొప్ప నీతిని ఉపదేశించిన పుణ్యాత్మురాలు అదే రోజు చేసిన పని - స్పష్టంగా నా కళ్ళయెదుట పడితే - టొత్తిగా చిన్నికిష్టుడి చిలిపిపని అని యెలా కొట్టిపారెయ్యను?

ఆ రోజు సీతాఫలాలు అమ్మకానికి వచ్చాయి. చంకన ఓ మూడేళ్ళ కొడుకుని ఎత్తుకుని యెవర్తో అమ్మి బుట్టడు పళ్ళు అమ్మకానికి తెచ్చింది. బాగా పెద్ద పళ్ళు.

"నాకు చెయ్యి తీరికలేదు అత్తయ్యా, మీరే మంచివి యెంచి ఓ డజను తీసుకోండి" అంటూ అమ్మ డబ్బు యిచ్చి చెల్లెలికి అన్నం

తినిపించడానికి లోపలికి తీసికెళ్ళింది.

నేనూ పళ్ళు యెంచుతానంటే 'అక్కర్లేదు నీ పనేదో నువ్వు చూసుకో' అని బామ్మ కసిరి కొట్టింది. నేను దూరంగా కుర్చీమీద కూచున్నాను. ఎదురింటి నుంచి తెచ్చిన వీక్లీలో సినిమా బొమ్మలు చూస్తున్నాను. అయినా నా దృష్టంతా యిటే వుంది, యెప్పుడు ఓ పండు అంకించుకుందామా అని.

ఓ అరగంటసేపు పళ్ళమ్మిని కిందా మీదా పెట్టింది బామ్మ. డజనూ తీసుకుంటానంటే రెండ్రూపాయిలకి యిస్తానని ఎలాగైతేనేం పళ్ళమ్మి ఒప్పుకుంది. ఇంకేం, కోడలు యిచ్చిన రెండ్రూపాయిలూ సరిగ్గా సరిపోయింది. ఇదిగో డబ్బు. బుట్ట ముందుకి జరిపి నువ్వు కొంచెం వెనక్కి జరుగు. మంచివీ నాక్కావలసినవీ నేనే యేరుకుంటాను. నువ్విలా మీద మీదకి రాకు దూరం" అంటూ పన్నెండు పళ్ళూ యెంచి ఓ పక్కగా పెట్టింది బామ్మ.

'అమ్మ నా కొడుకోయ్' అని అరిచింది పళ్ళమ్మి కొడుకు కనపడక. ఇంట్లోకి బుట్ట తెచ్చి దించినప్పుడే వాణ్ణీ దించింది. నడకొచ్చిన వెధవ. ఎక్కడికి పోయాడో! నేనూ పళ్ళమ్మితోపాటు వీధిలోకి వెళ్ళేను. ఎవరో గోళీలు ఆడుతూంటే చూస్తున్నాడు వాడు. పిర్రమీద ఒక్కటిచ్చి వాణ్ణి యెత్తుకుని లోపలికి తీసుకొచ్చింది. అప్పుడే అప్పలమ్మ వస్తూంటే దానిచేత బుట్ట నెత్తిమీద కెక్కించుకుని అమ్మకం కేకవేసుకుంటూ వెళ్ళిపోయింది.

అది కొడుకుని తెచ్చుకునే లోగా యింట్లో కనికట్టు జరిగిపోయింది.

బామ్మ ఎంచిపెట్టిన డజను పళ్ళూ వేరే పళ్ళెంలో కనిపిస్తూనే వున్నాయి. వేరే ఓ మూల బీరువా చాటున యెత్తుగా యేదో కనిపించినట్టయింది. చటుక్కున వెళ్ళి బామ్మ గావంచా తీశాను.

అదనంగా రెండు సీతాఫలాలు! దొంగని పట్టుకున్నట్టు కోపంగా బామ్మ కళ్ళలోకి చూశాను. ఆవిడ నదరలేదు బెదరలేదు. పైగా అంటుందీ

'ఎంత దౌర్జన్యమూ దురన్యాయమూ కాకపోతే రూపాయికి ఆరు పళ్ళేమిటీ? ఇలాంటి పాపిష్టి ముండలకి యిలాగే బుద్ధిచెప్పాలి. ఇంతకీ దీన్ని దొంగతనం కాదని ఎక్కడుందంట? పొద్దున్నే ఏ తోటలో దూరి దొబ్బుకొచ్చిందో!'

క క క

ఇంట్లో వుండి యిలాంటివి చూస్తున్నకొద్దీ వాటికి అలవాటుపడిపోయి మొదట్లో యీ తప్పులు మామూలు విషయాలుగా తోచసాగేయి. 'క్రమంగా యిలాంటివి మనమూ చైసేస్తే యెంత బావుణ్ణు' అనే స్థితికి చేరుకున్నాం మా కుర్రాళ్ళ మందరం.

పెద్దలూ!

చాక్లెట్టులాంటి యీ అయిదు సూత్రాలూ మాకు యిచ్చారు.

1. ఆడి తప్పరాదు.
2. అసభ్య పదములు ఉచ్చరించరాదు.
3. కన్నతల్లి మనసు కష్టపెట్టరాదు.
4. లేనివారిని నీచముగా చూడరాదు.
5. దొంగతనము చేయరాదు.

ఇవి మాకు ఇచ్చినందుకు సంతోషంగా స్ట్రాంగు బిళ్ళలలాంటివి మరి రెండు మీకు బహూమతి యిస్తున్నాం, తీసుకోండి.

1. మీరు పాటించలేని నీతులను పిల్లలకు చెప్పరాదు.
2. మీ అడుగుజాడలలో నడిచిన పిల్లలను దండించరాదు.

ఏదో మా నెత్తిమీద రుద్దుతున్నారని కోపంతో యిలా అన్నాం కాని, మీరొక్క మొటికాయ వేశారంటే మూడురోజులు మాడు అదిరిపోతుంది మాకు. తప్పులు చేస్తూ శిక్ష పడని లైసెన్సు సంపాదించాలంటే మేం త్వరగా పెద్దవాళ్ళం కావడమే మార్గం. అందుకే 'సామూహిక వ్యాయామక్రీడలు' ప్రారంభించాం. ఒకరికి నీతులు చెబుతూ హాయిగా బతికే స్థాయికి మమ్మల్ని త్వరగా చేరుకోమని పెద్దలందరూ మమ్మల్ని దీవించండి. □



